# నీ ఒక్కటే చాలు

యస్. శ్రీదేవి

కథ

ప్రశ్న మనిషి మనసులోంచీ పుడుతుంది. అనుభవంలోంచీ కూడా పుడుతుంది. మనసులోంచీ పుట్టినప్పుడు కుతూహలంతోటీ అనుభవంలోంచీ పుట్టినప్పుడు జ్ఞానంతోటీ జవాబుని వెతుక్కుంటూ ఏదో జరిగాక తెలిసిన నిజం కన్నా ఏమీ జరక్కుండా దొరికే సమాధానం చాలా విలువైనది.

★ ★ ★

''జీవితం బోర్ కొడ్తోందే!'' అంది సౌగంధ లంచిటైమ్‌లో స్వరూపతో.

''ఐతే..ఓ పన్చెయ్'' అంది స్వరూప.

''ఏంటది?''

''మంచి ఫైవ్ స్టార్ హోటల్ చూసుకుని దానిమీంచీ దూకెయ్. థ్రిల్లుకి థ్రిల్లూ, బోర్ లైఫ్‌కి ముగింపూ''

సౌగంధ ఆ మాటలకి వుక్రోషం పట్టలేక భుజం మీద గట్టిగా గిచ్చింది. ''అబ్బా!'' కెవ్వుమంది స్వరూప.

''అందరూ మననే చూస్తున్నారు. జోక్సొద్దు. సీరియస్‌గా చెప్తున్నాను'' అన్న సౌగంధ మాటలకి-

''లేకపోతే ఏమిటే? బోర్ కొడ్తోందని ఈ మొగుణ్ణొదిలేసి యింకొకడిని చేసుకోవడానికి యిదేం అమెరికా కాదు. నోట్ల కట్టలు తగలేసి నావెల్టీ వెతుక్కోవడానికి మనకేం బిల్‌గేట్స్ పవరాఫ్ ఎటార్నీ లేదు..'' కోప్పడింది స్వరూప.

సౌగంధ కళ్ళలో నీలినీడలు కదిలాయి. ''నీలా నవ్వుతూ జోక్సేస్తూ సరదాగా గడిపెయ్యటం నాకు రాదు. ఒక్కొక్కసారి చచ్చిపోదామన్నంత నిర్వేదం కలుగుతుంది. ఎందుకో తెలీదు. జీవితం వెల్తిగా అనిపిస్తోంది'' అంది.

స్వరూప సుదీర్ఘంగా నిశ్వసించింది. పిల్లలకి కొంత వయసొచ్చాక అంటే వాళ్ళ పనులు వాళ్ళు చేసుకునే స్థాయికి ఎదిగి, తమ చదువు, తమ ఫ్రెండ్సు అంటూ స్వంత లోకాన్ని నిర్మించుకోవటం ప్రారంభించాక చాలామంది ఆడవాళ్ళలో యిలాంటి డిప్రెషన్ తప్పనిసరిగా చోటు చేసుకుంటుంది.

''నీకు తెలీదు. రోహిత్ చాలా డిటాచ్‌డ్‌గా వుంటాడు. అది నాకు దుర్భరంగా అనిపిస్తోంది'' అంది సౌగంధ. ''ఆఫీసులో అలసిపోయేంత పని చేస్తాడు. ఇంటికొస్తూ మళ్ళీ కొంత తెచ్చుకుంటాడు. ఆఫీసు వాతావరణాన్ని యింటిదాకా ఎందుకు తెస్తావని అడుగుతాను. వోటీ వర్కు మిగిలిపోయిందంటాడు. టియ్యే డియ్యేలొస్తాయని కేంపులకి వెళ్తాడు. ఎందుకిదంతా అని నేను



వాదిస్తే మనందరికోసమేనని అతను జవాబిస్తాడు''

''రోహిత్ నోటీ వర్క్ యింటికి తెచ్చుకుంటే మావారు పొద్దుపోయేదాకా ఆఫీసులోనే వుండిపోతారు. ఫ్రెండ్స్ సర్కిలూ ఎక్కువే. ఒక్కోసారి వాళ్ళతోటే బైట ఏ హోటల్లోనే తినేసి యింటికొస్తారు. వాళ్ళనుంచీ ఏమీ ఆశించకుండా వుంటేనే మనం హేపీగా వుండగలుగుతాం. లేకపోతే అసంతృప్తే''

''నువ్వు చెప్పింది నిజమేనేమో! కానీ వాళ్ళ నుంచీ ఏమీ ఆశించకుండా ఎలా వుంటాం? చిన్న చిన్న సరదాలన్నీ చంపుకుని బతుకు భారంగా యీడ్చటం దేనికి? తనకో పదివేలు జీతం. నాకింకో పది. దాంతో సుఖంగా బతకలేమా?''

''అతన్తో ఈ విషయాలు చెప్పావా?''

''ఎన్నోసార్లు. రోజూ మా మధ్యని అదే ఘర్షణ. వయసులో వున్నవాళ్ళం. సరదాలన్నీ మానుకుని ఎంత సంపాదించి, ఎంత దాచి ఏం లాభం? మధ్య తరగతి వాళ్ళం, మళ్ళీ మధ్య తరగతే అనిపించుకోవడానికి యింత కష్టం దేనికి?''

సౌగంధ పదే పదే అదే పాయింటు దగ్గరికి రావటాన్ని గమనించింది స్వరూప. ఎంత సెన్సిటివో సుఖపడాలనే తపన అంతగానూ వుంది సౌగందలో.

సుఖమంటే? దానికామె యిచ్చే నిర్వచనం...లేనిపోని బాదరబందీలేవీ పెట్టుకోకుండా రోజుల్ని దొర్లించెయ్యడం. భర్తకామె మాట్లాడేదంతా అర్ధరహితంగా అనిపిస్తోంది. ఆ విషయాన్ని ఎన్నోసార్లు స్వరూపతో చెప్పింది.

## కొన్నాళ్ళాగితే..

**శిల్పాషెట్టి సోదరి షమితాషెట్టి ఇప్పుడు మంచి సినిమాల్లో నటించేందుకు తన టైం అంతా కేటాయిస్తోంది. 'ఓ మంచి సినిమాతో జనం ముందుకి రావాలని ఉంది. అందుకే మంచి కథలు వింటూ డైరెక్టర్స్‌తో డిస్కస్ చేస్తూ టైం గడుపుతున్నాను. నా ఖాళీ టైం అంతా ఇంటర్నెట్ ముందే. మ్యూజిక్ వినడం, మంచి పుస్తకాలు చదవడం నా హాబీగా మారిపోయింది. ఈ గ్యాప్ నాలో ఎలాంటి మార్పును తీసుకొచ్చిందో కొన్నాళ్ళాగితే గానీ మీకు తెలియదు' అంటోంది షమితా.**

సౌగంధ ఎంత చెప్పినా అతను పట్టించుకోడా లేక అతను పట్టించుకునేలా ఆమె చెప్పలేకపోతోందా?

''ఏమిటి, అంత ఆలోచనలో పడ్డావు?'' కుదిపింది సౌగంధ. స్వరూప తేరుకుంది. ''ఇదింత అర్జెంటుగా లంచి రూమ్‌లోనో ఐస్‌క్రీమ్ పార్లర్లోనో తేలే విషయం కాదు, సీట్లోకెళ్దాం పద'' అని లేచింది సౌగంధ. ఇద్దరూ కదిలారు.

''పిల్లల్ని దృష్టిలో వుంచుకుని తొందరపాటు పన్లేం చెయ్యకు'' హెచ్చరించింది స్వరూప నడుస్తూ. సౌగంధ నవ్వేసింది.


★ ★ ★

కార్తీక్ మళ్ళీ కలవకపోతే సౌగంధ ఏ నిర్వేదపు వూబిలో కూరుకుపోయేదో! రోజూ రోహిత్‌తో దెబ్బలాట వేసుకోవటం అందులో ఓడిపోవటం..ఉక్రోషం..చిరచిర..నాటిని..పిల్లలమీద చూపించటం..ఇవన్నీ ఒక సుడిగుండంలా ఆమెని తమలోకి లాక్కుంటున్నాయి.

కార్తీక్!

ఒక సుడిగాలిలా ఆమెని చుట్టేసాడు. వ్యక్తిత్వపు పునాదుల్తో సైతం కదిలిపోయిందామె.

ఇద్దరూ టెన్త్‌దాకా క్లాస్‌మేట్స్. ఒకే చోట చదువుకున్నారు. స్కూలు వదిలి పెట్టేసాక ఒక పెళ్ళిలో కలిసారు. అప్పటికి సౌంగధకి పెళ్ళైంది.



''మై హజ్బెండ్'' అని రోహిత్‌ని పరిచయం చేసేసరికి కార్తీక్ ఆమెని విస్మయంగా చూసాడు. అప్పుడతనికి పంధొమ్మిదేళ్ళు. పెద్దవాళ్ళ దృష్టిలో చాలా చిన్నవాడు. తన వయసే వుండే సౌగంధ పెళ్ళై మరొకరి భార్యగా బాధ్యతాయుతమైన స్థానంలో కనిపించేసరికి తికమకపడ్డాడు.

ఆ తర్వాత యిద్దరూ ఒక యింటర్వ్యూలో కలిసారు. తనకి యిద్దరు పిల్లలని చెప్పి అతన్ని మరోసారి షాక్ చేసింది సౌగంధ. అప్పటికి అతనింకా ఆడపిల్లల గురించి ఆలోచించడం లేదు. తన కెరీర్ గురించే చూసుకుంటున్నాడు.

ఆ యింటర్వ్యూలో యిద్దరూ సెలక్టవలేదు. కార్తీక్ కలిసినట్టు రోహిత్‌కి చెప్పి తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయిందామె. మళ్ళీ అతన్ని కలుస్తాననిగానీ కలవనే కలవననిగానీ అనుకోలేదు. అదంత అప్రస్తుతమైన విషయం ఆమెకి ఆ సమయాన.

ఆరోజు..

సౌగంధకి యింటి దగ్గర బాగా లేటైంది. నోవా పార్క్ చేసి, బేగ్ తీసుకుని గబగబా లిఫ్ట్ వైపు వస్తుంటే సరిగ్గా అదే వేగంతో ఎదుటివైపునుంచీ వచ్చి డేషిచ్చాడొక వ్యక్తి.

''సారీ!'' ఇద్దరూ ఒకేసారి వెనక్కి జరిగి అన్నారు అప్రయత్నంగా.

''హాయ్! సౌగంధా వాటే సర్‌ప్రైజ్!'' అన్నాడు కార్తీక్.

''నువ్వేంటి..యిక్కడ?'' అంతే ఆశ్చర్యపోతూ అడిగింది సౌగంధ. అలా అడుగుతూనే ''లిఫ్టు పైకి వెళ్ళిందంటే మళ్ళీ కిందకి రావటానికి చాలా టైం పడ్తుంది'' అంది.

''ఆలస్యంగా వచ్చేవాళ్ళకోసం మెట్లు కూడా వేసింది మన సంస్థ'' ఓదార్పుగా అన్నాడు కార్తీక్ తనే ముందు దారితీస్తూ. అతన్ని అనుసరించింది.

ఇద్దరూ మాటల్లో పడ్డారు. తను పర్చేజ్సె సెక్షన్లో చేస్తున్నట్టు చెప్పాడు కార్తీక్. అన్ని రోజులుగా అదే బిల్డింగ్‌లో పనిచేస్తూ కూడా ఒకరికొకరు కలవకపోవటం పట్ల ఆశ్చర్యాన్ని ప్రకటించింది సౌగంధ. థర్డ్‌ఫ్లోర్ చేరేసరికి అతనికి బై చెప్పి సీట్లో కూర్చుంది.

లంచిటైమ్‌లో కార్తీక్ వచ్చాడు. అతన్ని స్వరూపకి పరిచయం చేసింది. ఇద్దరికీ చిన్న ట్రీట్ యిచ్చాడు.

అతని విషయం రోహిత్‌తో చెప్పింది సౌగంధ ఆ రాత్రి. అతను మామూలుగా విని వూరుకున్నాడు.

★ ★ ★

కార్తీక్ రాకతో సౌగంధ రొటీన్లో మార్పొచ్చింది. మధ్యమధ్యలో అతనొచ్చి ఆమె బ్రాంచిలో కూర్చుంటాడు. లంచి ఆమెతో

కలిసి తీసుకుంటాడు. వాళ్ళిద్దరి మధ్యా స్వరూపకి యిరుగ్గా అనిపిస్తుంది.

సౌగంధ కార్తీక్ ప్రెజెన్స్‌ని బాగా ఎంజాయ్ చేస్తోంది. చిన్నప్పటి జ్ఞాపకాలు..అప్పటి స్నేహాలు..అప్పట్లో, తామున్న వూరు..వాళ్ళ మాటల్లో దొర్లిపోతుంటాయి. అతను సౌగంధతో యింటికి రావటం పట్ల రోహిత్‌కి ఎలాంటి అభ్యంతరం లేదు. వాళ్ళ మాటలు వింటుంటే మాత్రం సౌగంధ యింత యిమ్మెచ్యూర్గా అనిపిస్తుంటుంది.

శ్రీశ్రీ కవిత్వం గొప్పదా, సినారె కవిత్వం గొప్పదా అని వాళ్ళ స్కూల్లో టెన్త్‌క్లాస్‌లో పెట్టిన డిబేట్ గురించి యిప్పుడు వాదించుకుంటారు. ఇదంతా సిల్లీగా అనిపిస్తుంది రోహిత్‌కి. స్కూల్ ఆల్బం ముందు పెట్టుకుని క్లాస్‌ఫోటోల్లో ఒకరినొకరు గుర్తుపట్టడానికి ప్రయత్నం చేస్తుంటే మాత్రం రియల్ మేడ్‌నెస్ అనిపించింది.

★ ★ ★

గండిపేట పిక్నిక్కి వెళ్దామనుకున్నారు స్టాఫంతా..కుటుంబాలతో. చాలా వుత్సాహపడింది సౌగంధ వెళ్ళాలని. తీరా ఆ టైమ్‌కి రోహిత్‌కి కేంపు పడింది. సౌగంధనీ పిల్లల్నీ వెళ్ళమనేం అనలేదు. పైగా ''పిక్నిక్‌లకీ టూర్లకీ తిరిగితే ఏమొస్తుంది. డబ్బు వేస్ట్. టైమ్ వేస్ట్? పైగా అలసట. అంతా అయితే నేను తిరిగొచ్చాక అందం కలిసి పిక్చర్కెళ్దాం'' అన్నాడు.

సౌగంధ వుత్సాహమంతా వుఫ్‌మని వూదేసినట్టు ఎగిరిపోయింది.

జీవితమంతా యితన్తో యిలాగే గడపాలా అని దిగులేస్తోంది ఆమెకీమధ్య. అప్పటిదాకా తన రొటీన్లో ఒక భాగంగా సంఘర్షిస్తూనే సర్దుకుపోయిన అతని వ్యక్తిత్వం, తప్పనిసరిగా వప్పుకున్న అతని మనస్తత్వం, యిప్పుడు..అంటే కార్తీక్‌తో పరిచయం పెరిగాక లోపాలుగా కనిపించడం మొదలుపెట్టాయి.

ఎందుకు, రోహిత్ కార్తీక్‌లా నవ్వుతూ నవ్విస్తూ చలాకీగా తిరగడు? యార్డ్లీ పరిమళాలు వెదజల్లడు? తననీ పిల్లల్నీ గుండెల్లో పొదువుకుని ప్రేమబాసలు చెప్పడు? ఎంతసేపూ డబ్బు...అదే యావ.

కార్తీక్‌తో పోలిస్తే అన్నీ వైరుధ్యాలే. జవాబులకోసం, సమన్వయం కోసం ఆలోచించి, ఆలోచించి అలిసిపోతోంది తప్ప అవి దొరకటం లేదు.

కార్తీక్ కూడా గండిపేట వెళ్ళలేదు. ఎందుకని అడగలేదు సౌగంధ. అతని జవాబు వినాలంటే భయం వేసింది. తామిద్దరి మధ్యా అవాంఛనీయమైనదేదో చోటు చేసుకుంటోందనిపించింది.

అతన్తో పరిచయాన్ని అక్కడితో తుంచేస్తే బావుంటుందనీ వుంది. అతని స్నేహం తెచ్చిన వసంతం అతనితోటే వెళ్ళిపోతుందనే భయమూ వుంది.

అన్నిట్లో ఆసక్తి తగ్గిపోతోంది సౌగంధకి. ఏదో కావాలనే ఆరాటం వుంది. కార్తీక్ ఆమెని దీపశిఖలా ఆకర్షిస్తున్నాడు. బలమైన అయస్కాంతంలా తన వైపు లాక్కుంటున్నాడు.

పర్యవసానం ఏమిగా వుండబోతోందో అర్థం కావడం లేదు. ఆకర్షణ, అందులోంచీ విడివడటం..ఈ రెండూ చాలా బలమైన వైరుధ్యాలు.

★ ★ ★

సౌగంధలో వచ్చిన మార్పుని గమనించింది స్వరూప. కార్తీక్‌తో పరిచయానికి ముందు అశాంతితో రగిలిపోవటానికీ, యిప్పుడు సంఘర్షణలో కొట్టుకుపోవటానికీ గల తేడాని.

''ఏమిటో..కొంపలంటుకుపోతున్నట్టు పంథొమ్మిదేళ్ళకి పెళ్ళిచేసేసారు మా అమ్మా నాన్నా. నా వయసువాళ్ళకి యిప్పటికింకా ఏ బాధ్యతాలేదు.'' అంది సౌగంధ కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా.

''ఎవరు సౌగంధా?'' అడిగింది స్వరూప.

''కార్తీక్ లేడూ?''

''అతను మగవాడు''

''ఐతే మాత్రం? అంత ఎర్లీగా పెళ్ళి చేసేసుకుని, పిల్లల్ని కనేసి, వూపిరాడక గిజగిజలాడిపోవాలా? కనీసం పెళ్ళంటే ఏమిటో, ఎందుకో అర్థం చేసుకుని ఎలాంటివాడు కావాలో ఒక నిర్ణయానికొచ్చేదాకా ఆగక్కర్లేదా?''

స్వరూప యింకా నవ్వుతునే అంది- ''అప్పుడు మాత్రం నీకు నచ్చిన వ్యక్తిని చేసుకునే స్వేచ్ఛ వుంటుందంటావా సౌగంధా? అస్సలే వుండదు. మనకేం కావాలో కచ్చితంగా తెలిసుండీ ఎదుటివాళ్ళిచ్చిన దాంతో సర్దుకుపోవటం యింకా నరకం. పెళ్ళప్పటికి నీకైతే పంథొమ్మిదిగానీ నాకు యిరవై నాలుగు. రమణని పెళ్ళిచూపుల్లో చూసినప్పుడు నాకెందుకో అతన్ని చేసుకోవాలనిపించలేదు. నచ్చలేదని చెప్పాను''

ఆశ్చర్యంగా చూసింది సౌగంధ.

''ఐదు నిమిషాల పెళ్ళిచూపుల్లో అవతలి వ్యక్తి గురించి ఏం తెలుస్తుంది? అన్నీ మేము తెలుసుకున్నాం అన్నారు నా పేరెంట్సు. ఫేస్ యీజ్ ద యిండెక్స్ టు మైండ్ అంటారు. కొద్దిగా మనలో యిన్‌సైటు వుండాలిగానీ ఎదుటివ్యక్తిని చదవటానికి క్షణం చాలదూ?''

''నీకు రమణగారు నచ్చలేదా?''

''నువ్వడిగినట్టే అడిగారు అమ్మా నాన్నా. ఎందుకు నచ్చలేదు? కన్నొంకరా? కాలొంకరా? ఉద్యోగం లేదా? ఆస్తిలేదా? ఏం తక్కువ? అని రకరకాల ప్రశ్నలడిగి అన్నిటికీ పాజిటివ్ రెస్పాన్స్ లాగి, నా నోరు మూయించి పెళ్ళి చేసారు.''

''నిజంగానే అడుగుతున్నాను. ఆయన నీకెందుకు నచ్చలేదు?''

''ఇన్‌స్టింక్చువల్ అనుకుంటా''

''మరి? బాగానే వున్నారు కదే, యిద్దరూ?''

''బాగా అంటే?''

సౌగంధ తికమకపడింది. అసలు స్వరూప ఆమె వైవాహిక జీవితాన్ని గురించీ, అందులోని రహస్యపు కోణాలని గురించీ చెప్పటమే పెద్ద ఆశ్చర్యం.

''అంటే అతను చెడ్డవాడనా?''

స్వరూప నవ్విందిగానీ జవాబివ్వలేదు.

''ఏంటో సరూ! ఈ పెళ్ళిళ్ళూ, వ్యవస్థా అన్నీ గందరగోళంగా అనిపిస్తున్నాయి.''


''ఎప్పట్నుంచీ? కార్తీక్‌తో పరిచయం పెరిగాకా?'' సూటిగా అడిగింది స్వరూప. సౌగంధ ముఖం పాలిపోయింది. ఏదో చెప్పబోయిందిగానీ మాటలు దొరకలేదు.

''నచ్చని వ్యక్తిని చేసుకోనని తెగించి చెప్పే ధైర్యస్వతంత్రాలే లేని మనకి భర్తల్ని మార్చే స్వతంత్రం వుంటుందంటావా?''

స్వరూప గొంతు పదునుగా వుంది. ''ఒకవేళ అలాంటి స్వేచ్ఛ వుందనే అనుకుందాం. ఏవో ప్రలోభాల కోసం పెళ్ళి చేసుకుని ఆ భార్య నచ్చలేదని మరో స్త్రీ వెంట తిరిగే మగవారికీ మనకీ తేడా ఏమిటి? సౌగంధా! ఇప్పటికే మీ యిద్దరి గురించీ రకరకాలుగా అనుకుంటున్నారు. అవన్నీ రోహిత్‌కి తెలిస్తే ఎలా వుంటుందో ఆలోచించు.''

సౌగంధ ముఖం మరింత పాలిపోయింది.

స్వరూప మళ్ళీ అంది. ''రోమ్ వజ్ నాట్ బిల్ట్ యినే డే అంటారు. స్త్రీ స్వాతంత్ర్యం కూడా అంతే. మా అమ్మమ్మ తల్లికి మూడేళ్ళకి పెళ్ళై ఏడేళ్ళకి భర్తని కోల్పోయి అప్పట్నుంచీ జీవచ్ఛవంలా బతికిందట. తొంభై సంవత్స



రాలు. ఆవిడ మా అమ్మమ్మని పెంచుకుందట. అంతా ఎన్నన్నా వినకుండా అమ్మమ్మకి రజస్వలా నంతర వివాహం చేసిందట. మా అమ్మ కొద్దిగా చదువుకున్నా, ఆ చదువు ఆర్థిక స్వావలంబన నివ్వ లేదు. అందుకని నాకు చదువుతోపాటు ఉద్యోగం వుండాలని ఆశించింది. ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు లైఫ్ పార్ట్‌నర్‌తో కంపేటిబులిటీ వుండాలనేది నా ఆకాంక్ష. అది నాకు సాధ్యపడలేదు. కనీసం మన తర్వాతి తరానికి ఆ అవకాశాన్ని యివ్వగల మేమో! సౌగంధా స్వేచ్ఛాపరిణయం మన ఆకాంక్ష. అది కుటుంబానికి పునాది కావాలిగానీ విచ్ఛిత్తికి కారణం కాకూడదు. కుటుంబం అంటే అమ్మా నాన్నా పిల్లలు. అంతేగానీ కొందరు వ్యక్తులు కలిసి వుండటం కాదు. పిల్లలకోసం బంగారు భవిష్యత్తు కనిపిస్తూ వుంటే మన స్వార్థంకోసం దాన్ని చెదరగొట్టడం ఎంతవరకూ సరైనదో?''

ఆమె మాటలు సౌగంధని మరింత తపన లోనూ సందిగ్ధంలోనూ పడేసాయి.

ఇదంతా జరిగాక సరిగ్గా కొన్ని గంటల తర్వాత కార్తీక్‌కీ సౌగంధకీ మధ్య ఒక ముఖ్యమైన సంభాషణ జరిగింది.

★ ★ ★

''కార్తీక్! నువ్వింకా పెళ్ళెందుకు చేసుకోలేదు?'' అడిగింది సౌగంధ. నవ్వుతూ చూసాడు గానీ జవాబు చెప్పలేదు. ఆమె రెట్టించింది. ఏదో తెలుసుకోవాలని ఆమె కోరిక. అతని అంతరంగంలోకి దారి వెతుక్కుంటోంది. వెళ్ళాలనీ వుంది. వద్దనీ వుంది. అదే వైరుధ్యం..ఆకర్షణ..అందులోంచీ విడివడాలనే కోరిక.

''పెళ్ళంటే ఏమిటో, ఎందుకో అనుభవం గలదానివి, నువ్వు చెప్పు''

ఆమె నిస్సహాయంగా చూసింది. తన అనుభవం తననే సందిగ్ధంలో పడేసి జవాబువెతుక్కోమంది. ఇంక అతనికేం చెప్పగలదు?

''నువ్వేకాదు ఎవరూ చెప్పలేరు సౌగంధా! ఎట్టకేలకి సంసార సాగరం యీది ఒడ్డుకి చేరగలిగాం అని జీవితపు చరమాంకంలో సుదీర్ఘంగా విశ్వసించిన మహామహులెంతో మంది- ఏం సాధించారంటే జవాబు చెప్పలేక ఖాళీగా మిలిగిన చేతులకేసి చూసుకుంటారు. ఏ అనుభూతీ మిగిలిలేని మనసులోకి చూసుకుంటారు. అంత అయిష్టంగా పెళ్ళి చేసుకోవడం దేనికి? అందులో ఏదో వుందనే ఆశ చేత. అదేదో అందీ అందనట్టు వూరిస్తుంది''

''.....''

''సుఖ పడటానికే పెళ్ళైతే నీ కళ్ళలో ఆ నీలి నీడలెందుకు? ఏదో కోల్పోయినట్టు ఆ వెతుకులాట దేనికి? మీ యిద్దరి మధ్యనీ అగాధమంత దూరమెందుకు?''

''కార్తీక్!'' సౌగంధ పెదవులు వణికాయి. గుండెలోతుల్లో ఎక్కడో మొదలైన ప్రకంపనాలు గొంతులోకి ఎగదన్నుకొచ్చి అలా బహిర్గతమయ్యాయి. అతను...అతను తనని పూర్తిగా చదివేసాడా? విభ్రాంతిగా అనుకుంది. ఏమీ తెలీనివాడనుకుంది. అన్నీ ఎలా తెలుసుకున్నాడు?

స్త్రీ తనకి తారసపడిన మగవాడికి ఏమీ తెలీదనుకుంటుంది. ఆమెలోని ఆ తెలీనితనాన్నే అతను ఎంజాయ్ చేస్తాడు.

సౌగంధకి పెళ్ళైందని మొదటిసారి తెలిసినప్పుడు అతన్లో వున్నది పసితనమే. ఆమెకి పిల్లలు పుట్టారని తెలిసినప్పటికి యింకా అతనిలో మెచ్యూరిటీ రాలేదు. ఇప్పుడు మాత్రం అతను పరిపూర్ణ యువకుడు. ఆమె వైవాహిక జీవితంలోని చీకటి కోణాలని స్పృశించి, ఆమెలోని అసంతృప్తిని తట్టి లేపి, తను దానికి స్వాంతన కావాలనుకుంటున్నాడు.

చాలాసేపు యిద్దరూ మౌనంగా వున్నారు. సౌగంధకైతే అతని ముఖంలోకి చూడాలన్నా భయంగానే వుంది. ముఖం నిండా చిరుచెమట్లు అలముకున్నాయి.

''నాకు నిన్నెప్పుడు చూసినా ఆశ్చర్యంగా వుంటుంది సౌగంధా! స్కూల్‌మేట్స్‌గా మనం విడిపోయాక మళ్ళీ కలుసుకునేసరికే నీకు పెళ్ళైపోయింది. ఐ వజ్ స్టన్డ్. తరువాత కూడా నిన్నెప్పుడు చూసినా అదే ఆశ్చర్యం..ఇద్దరికీ ఒకటే ఏజి..అప్పుడే నీకు పెళ్ళీ..పిల్లలూ..''

''ఔను. జీవితంలో అన్నీ అయిపోయాయనిపిస్తోంది'' సౌగంధ గొంతులో విషాదం.

''విడాకులతో కొత్తజీవితాన్ని మొదలుపెట్టు'' అన్నాడు కార్తీక్ కూల్‌గా.

ఆమె వులిక్కిపడింది. తను నిజంగానే విందా అని ఆశ్చర్యపోయింది. తమలో అలాంటి ఆకాంక్ష వుందా అని కూడా ఆశ్చర్యపోయింది. ఒకవేళ వున్నా వుత్పాతంలాగో కనీసం పెనుతుఫానులాగో వచ్చి పడుతుందనుకున్న ఈ ప్రస్తావన యింత సైలెంటుగా జరిగిందేమిటని కూడా ఆశ్చర్యం కలిగింది.

''మీరిద్దరూ డైవోర్సు తీసుకునే విషయాన్ని గురించి ఆలోచించు. రోహిత్‌ని దానికి మెంటల్‌గా ప్రిపేర్ చెయ్యి. తర్వాత పిల్లల విషయంలో ఒక నిర్ణయానికి రండి. వాళ్ళని తను తీసుకుంటానంటే ఏ ప్రాబ్లం వుండదు. అలాకాకుండా మనమే తీసుకోవాలంటే వాళ్ళకోసం మంచి రెసిడెన్షియల్ స్కూల్ చూడాలి. సౌగంధా! పెళ్ళంటే జీవితానికి ముగింపుకాదు. ఫ్రెష్ బిగినింగ్. అలాంటిది



## మోడర్న్ లేడీ

**ఎప్పుడూ మోడర్న్‌గా కన్పించే పెరిజాద్ జొరాబియన్‌కి ఇప్పుడు ఫ్రెండ్స్ కూడా ఎక్కువైనట్టున్నారు. మార్నింగ్ రాగ సినిమాలో నటిస్తున్న ఈ భామ ఆ సినిమాలో ఓ సీన్‌లో పాట పాడుతూ కన్పిస్తుంది. అందానికి అందం, మత్తెక్కించే హొయలొలికించడంలో దిట్ట అయిన పెరిజాద్ గిటార్‌ని వదలడంలేదట. మున్ముందు నటించే సినిమాల్లో కూడా ఇలాగే కన్పిస్తానని చెబుతోంది. ఆమె ఇంట్రెస్ట్ కారణం ఏమై ఉంటుందబ్బా? ఆలోచించండి.**

నేను నీకివ్వగలనని అనుకుంటున్నాను''

అతనంత స్పష్టంగా చెప్పేసరికి ఆమె వుక్కిరిబి క్కిరైంది. అప్పుడు మొదలైంది. ఆమె మనసులో వుప్పెనలాంటి అలజడి. ఇలా జరగాలని తను ఆశిం చిందా? పర్యవసానం? అతను చెప్పినంత తేలిగ్గా వుంటుందా తామిద్దరూ పెళ్ళిచేసుకోవడం?

సౌగంధ ఆలోచనలో పడటం చూసి కార్తీక్ చిన్నగా నవ్వాడు.

''తొందరేం లేదు. బాగా ఆలోచించుకుని చెప్పు. ఇదమిద్ధంగాని వూగిసలాటకన్నా ఏదో ఒక నిర్ణయం తీసుకోవడం బాగుంటుంది కదూ?'' అనేసి వెళ్ళిపోయాడు.

★ ★ ★

రమణకీ, రోహిత్‌కీ పరిచయం వాళ్ళ భార్యల ద్వారానే. రమణ షేర్ కన్సల్టెంటు. ఆపైన సేవింగ్స్ ఏజెంటు. రోహిత్ తన యిన్వెస్ట్‌మెంట్ల గురించి తరుచు అతన్ని సలహాలడిగేవాడు. ఇద్దరిమధ్యా ఏర్పడిన పరిచయానికి సౌగంధా, స్వరూపల స్నేహం వ్యక్తిగత స్పర్శని అద్దింది. ఇద్దరూ యిప్పుడు మంచి స్నేహితులు.

అలాంటి రమణకి సౌగంధా, కార్తీక్‌ల గురించి తెలిసింది. షాకయ్యాడు. అర్థంకాని భావ సంచ లనం అతన్ని ముంచెత్తింది. ఎదుటివారి జీవి తాలూ, అనుభవాలూ ఒక్కొక్కసారి మనకోసం దర్పణాలౌతాయి. సౌగంధ మీద వెదజల్లబడిన రూమర్స్‌లోంచీ అతనింకేదో వెతుక్కుంటు న్నాడు. సౌగంధకీ రోహిత్‌కీ మధ్యని బలహీనపడిన వివాహబంధాన్ని తనకీ స్వరూపకీ మధ్యనున్న దానితో పోల్చుకుని చూస్తే సారూప్యత కనిపించి అతన్ని కలవరపెడ్తోంది.

ఏం కావాలి అసలీ ఆడవాళ్ళకి? భర్తనుంచీ, పెళ్ళినుంచీ ఏం ఆశిస్తారు? ఆస్తివద్దు. ఐశ్వర్యం వద్దు. భర్త అక్కర్లేదు. అంతర్ముఖులై తమలోకి తాము చూసుకుంటూ బ్రతికేస్తుంటే ఆ మౌనాన్ని బద్దలుకొట్టి తమ వైపు తిప్పుకోవడం ఎంతమంది మగవారికి సాధ్యపడుతుంది? అలాకాని సంసారా లన్నీ యింతేనా?

ఎంతో యిష్టపడి చేసుకున్నాడతను స్వరూపని. పెళ్ళయ్యాక తెలిసింది, ఆమెకి తనంటే యిష్టం లేదని. అంతా అయ్యాక తెలిసిన ఆ నిజాన్ని ఎలా హేండిల్ చెయ్యాలో తెలీక తను బాధప డ్తుంటే తల్లి అంది, ''చిన్నతనంకదూ, అలాగే వుంటుంది ఆడపిల్లలకి. చిన్నప్ప ట్నుంచీ పుట్టిపెరిగిన వాతావరణం, తల్లి దండ్రులూ, తోబుట్టువులూ అందర్నీ వదిలిపెట్టి కొత్తచోట, కొత్తవారితో కలిసి వుండాలంటే బాధకాదూ? దాన్ని అలా వ్యక్తపరచలేక ఏవేవో చెప్తుంటారు. నువ్వు ప్రేమగా చూసుకుంటే అది ఎంతలో మారిపోతుంది?''

అప్పట్నుంచీ తను స్వరూపని ప్రేమిస్తూనే వున్నాడు నిశ్శబ్దంగా. తమ మధ్య కూడా అంతేనా? ఎక్కడో కలుక్కుమంది.

అతను మొదటిసారి ఫ్రెండ్స్‌తో బార్లో అడుగు పెట్టాడు.

★ ★ ★

సౌగంధ ఆఫీసుకి సెలవుపెట్టి యింట్లోనే వుండి పోయింది. కార్తీక్ స్నేహాన్నించీ తను ఆశించింది యిదేనా? రోహిత్‌తో విడిపోయి అతని దగ్గరకి వెళ్ళి పోవడం..అందులోని సాధ్యాసాధ్యాలు..లైట్ హౌసు దీపంలా ఆమె మనసులో కదుల్తున్నాయి. ఒకసారి సాధ్యమనిపించింది మరో ఆలోచనతో అసాధ్యమనిపిస్తోంది.

పెళ్ళి...

ఒకమ్మాయిని, ఒకబ్బాయికిచ్చి చేస్తున్నామని దండోరా వేస్తున్నట్టు శుభలేఖలు వేయించి, బంధు వులకీ, తెలిసినవాళ్ళకీ స్నేహితులకీ యివ్వటం, వాళ్ళంతా పెళ్ళికి రావటం, బాజాభజంత్రీలు, వూరేగింపులు..


భార్యాభర్తలుగా తామందరికీ పరిచయమ వటం, జంటగా కలిసి శుభకార్యాల్లో నిలబడటం.

పిల్లలు..వాళ్ళ పేరెంట్సుగా సొసైటీలో పరిచ యాలు.

ఇవన్నీ యిలా జరగగా పెద్దలేసిన దండోరాని కాదని మళ్ళీ తిరిగి కార్తీక్‌ని తన భర్తగా నోటిపై చెయ్యటం అంత తేలికా?

అసలెందుకు యిదంతా? ఏం ఆశించి? ఇప్పుడు లేనిది అప్పుడు దొరుకుతుందా? ఏమి టిది? తను పోగొట్టుకున్నదా? పొందలేకపోయి నదా? అందీ అందక వూరిస్తున్నదా? జీవితమా? అనుభవమా? అనుభూతా? ఏదైనాసరే, కొంతకా లానికి పాతబడుతుంది. అప్పుడు మళ్ళీ యిదే పరి స్థితి పునరావృతమైతే? ఛెళ్ళున చరిచినట్టైంది సౌగం ధకి. అక్కడే గడ్డకట్టుకుపోయాయి ఆమె ఆలోచ నలు.

★ ★ ★




సౌగంధ అడిగిన ప్రశ్ననే సరిగ్గా యిరవైనాలుగు గంటల తర్వాత రోహిత్ కార్తీక్‌ని అడిగాడు. రూమర్ నిప్పుకణికలాంటిది. దాని వేడి ఎక్కడికో వ్యాపిస్తుంది. రోహిత్‌ని కూడా ఆ సెగ తాకింది. తన వెనుక సౌగంధ గురించి అనుకునే మాటలు విని నిర్విణ్ణుడయాడు. కోపం, బాధ, అవ మానం...ఎన్నో భావాలు కలగాపులగంగా కలిగిన స్థితి. సౌగంధ కార్తీక్‌ని ప్రేమించిందా? పెళ్ళికి ముందునించే వాళ్ళిద్దరి మధ్యా ప్రేమవుందా? అతను నమ్మలేకపోతున్నాడు. అమాయకమైన ఆమె ముఖం, చురుగ్గా కదిలే కనులు..ఎందుకో...తప్పుపట్టలేకపోయాడు. ఎదుటి వ్యక్తిమీదగల నమ్మకం సమస్యని పరిష్క రిస్తే అపనమ్మకం కొత్తసమస్యల్ని సృష్టిస్తుంది. రోహిత్ పరిష్కారం దిశగా నడవాలనుకున్నాడు.

అందుకే అడిగాడు కార్తీక్‌ని. ''నువ్వింకా పెళ్ళెం దుకు చేసుకోలేదు?'' అని.

కార్తీక్ తడబడలేదు. అతను తన దగ్గరికి వచ్చి ఇలా ఎందుకడిగాడో కారణాన్ని కొంత వూహించగ లిగాడు.

''నచ్చిన అమ్మాయి దొరకలేదు''

రోహిత్ సూటిగా అడిగాడు. ''సౌగంధలో నీకు నచ్చినదేమిటి?''

కార్తీక్ అప్పుడూ తడబడలేదు. రోహిత్ అన్నీ తెలుసుకుని ఒక నిర్ణయం తీసుకోవడానికో లేక తీసుకున్నదాన్ని తెలియపరచడానికో వచ్చి వుంటా డని అర్థమైంది.

''షీ యీజ్ గుడ్ కంపెనీ'' అన్నాడు నిదా నంగా.

రోహిత్ పెద్దగా నవ్వేసాడు. కార్తీక్ తెల్లబోయి చూస్తుండగా అన్నాడు, ''మనుషుల అభిప్రా యాలు ఎప్పటికీ ఒకేలా స్థిరంగా వుండవు. ఉన్న పరిస్థితులనిబట్టీ ఎదురైన అనుభవాలని బట్టీ మారుతుంటాయి. కాలంతోపాటూ మారతాయి. ఇంటిపనంతా పూర్తిచేసుకుని, ఫ్రెష్‌గా తయారై కారిడాల్లో, డిమ్‌లైట్ వెలుతుర్లో జాజిపందిరి పరి మళాల మధ్యని కూర్చుని షెల్లీ, కీట్స్ గురించీ కృష్ణ శాస్త్రి గురించీ చర్చించే సౌగంధ కంపెనీని నువ్వు ఎంజాయ్ చేస్తున్నావు. అదే సౌగంధ తల్లిగా, వుద్యోగస్తురాలిగా, గృహి ణిగా తన సాధక బాధకాలు చెప్పుకుం టుంటే నీకామె కంపెనీ నచ్చకపోవచ్చు'' అని కార్తీక్ ఏదో చెప్పబోతుంటే ఆపి, తనే కంటిన్యూ చేసాడు. అప్పటికి అతని పెదా లమీది నవ్వూ, ముఖంలోని ప్రసన్నతా ఎగిరిపోయాయి.

''నేను తనని ఆమె మాటలు వినో, కబుర్లకి మైమరిచో చేసుకోలేదు. ఆమె ఫేమిలీ బేక్‌గ్రౌండు, చదువు, కెరీర్ అవకా శాలు..యివన్నీ చూసి, చాలా పటిష్టమైన

వేదికమీద చేసుకున్నాను. మేం పెళ్ళి చేసుకున్నప్పుడు జీవితకాలం కలిసి వుండాలనే ఒడంబడిక చేసుకున్నాం. కలిసి పిల్లల్ని కన్నాం. ఇల్లు కట్టుకున్నాం. ఏ కారిడార్లోనైతే నీకామె మంచి కంపెనీ యిచ్చిందో అదే కారిడార్లో కూర్చుని మేము మా పిల్లల భవిష్యత్తుకి ప్రణాళికలు వేసాము. వాళ్ళు కుటుంబాలుగా ఎదిగినప్పటి సుదీర్ఘ భవిష్యత్తుని వూహించుకున్నాం. కార్తీక్! మా మధ్య కొన్ని భేదాభిప్రాయాలు వుండవచ్చు. ఏ యిద్దరు వ్యక్తులూ ఒక్కలా వుండరు. ఒక్కలా ఆలోచించరు. మేం కూడా అంతే. ఐనాగానీ మా యిద్దరి గమ్యం ఒకటే. సౌగంధకి తనమీద వచ్చిన రూమర్స్ తెలియక పోవచ్చు. తెలిసినా పట్టించుకోలేదేమో. ఒకవేళ తెలిసి, పట్టించుకుని ఏదైనా నిర్ణయం తీసుకోవలసిన పరిస్థితి ఎదురైతే మాత్రం నేను చెప్పిందే తనూ చెప్తుంది. నాకు తన మీద ఆ నమ్మకం వుంది. నీది ప్రేమని నేననుకోను. ఒకవేళ ప్రేమే అయినా అప్పటికే మరొకరి ప్రేమతో నిండిపోయిన స్త్రీ హృదయపు పాత్రలోకి దాన్ని వొంపకు'' అనేసి లేచి నిలబడ్డాడు.

కార్తీక్ నిరుత్తరుడై చూసాడు. ఏమీ మాట్లాడలేని పరిస్థితి. బంతి సౌగంధ కోర్టులో వుంది. ఆమెది నిర్ణయం. అప్పటిదాకా తనేం మాట్లాడలేదు. కనీసం రోహిత్‌లా హక్కుగానో అహంభావంగానో కూడా.

★ ★ ★

## జనం తెలివి

**జనం తెలివిమీరిపోయారు. హీరో, హీరోయిన్లు ఎవరైనా కథ, కథనం బాగుంటేనే ఏ సినిమాయైనా హిట్ అవుతుంది. 'ఇప్పుడు కొత్తదనం అంటే అంతా ఇష్టపడుతున్నారు. నేను కూడా పాత కథలకంటే కొత్త కథలు వినడానికే ప్రాధాన్యత ఇస్తున్నాను. కొత్త దర్శకులకి అవకాశం ఇచ్చి హిట్ కొట్టడానికి ప్రయత్నిస్తున్నాను. హీరోల ఇమేజ్ గురించి ఇప్పుడెవరూ ఆలోచించడం లేదు. నటన బాగుంటే థియేటర్‌కి వస్తున్నారు' అంటున్నాడు వెంకటేష్.**


రోహిత్‌కి యింటికి వెళ్ళాలనిగానీ సౌగంధ ముఖం చూడాలనిగానీ అనిపించలేదు. కార్తీక్ ముందు అలా మాట్లాడినా, సౌగంధ తనని వదిలిపెట్టి వెళ్ళదనే నమ్మకం వున్నా ఆమె ప్రవర్తన అతన్ని గాయపర్చింది.

ఎందుకు, ఆమె అలా ప్రవర్తించింది? తన నుంచీ ఏం ఆశించింది? ఎందుకని ఆమెకీ ప్రలోభం? తనని వదిలేసి కార్తీక్‌తో వెళ్ళిపోవాలనుందా? లేకపోతే డబుల్‌గేమ్ ఆడదామనుకుందా? ఎంతదాకా వచ్చింది వాళ్ళ చనువు? కోపం కట్టలు తెంచుకుని వస్తుంటే పార్కులో వెళ్ళికూర్చున్నాడు. ఆ స్థితిలో యింటికి వెళ్తే అసహ్యకరమైన గొడవ జరుగుతుందని అంత కోపంలోనూ తెలుసుకున్నాడు. అందుకే వంటరితనాన్ని కోరుకున్నాడు. ప్రశాంతమైన వాతావరణం కొద్దిసేపటికి అతని మనసుని చల్లబరిచింది. ఆలోచన మేల్కొంది. లేమిలోంచీ మధ్యతరగతికి ఎదిగాడు తను. తిండికీ, బట్టకీ చేసిన తడుములాటలోంచీ యిప్పటి యీ స్థాయికి చేరటంలో స్పష్టమైన ఎదుగుదల. సౌగంధకి అలాకాదు. చిన్నప్పట్నుంచీ ఒకే స్థాయిలో వుంది. తల్లిదండ్రులకి ఆమె, తమ్ముడు..యిద్దరే సంతానం..ప్రేమగా పెంచి, వున్నంతలో చదివించి, పెళ్ళి చేసారు. ఆమెకి మార్పేమీ కనిపించటం లేదు. రూపాయికి తనిచ్చే విలువ అర్థరహితంగా కనిపిస్తోంది. వున్నదాంట్లో ఆమెకి తృప్తివుంది. పైస పైస సంపాదించి కూడబెట్టడం పట్ల ఆసక్తిలేదు.

''దాచాలనుకున్నదేదో దాచిపెడ్తే మిగిలినది ఖర్చుపెట్టుకుంటాం. ఎలాగా మన దగ్గర విరివిగా ఖర్చుపెట్టేంత డబ్బుండదు. అలాంటప్పుడు ఖర్చు లెక్కేసుకోవడం దేనికి?'' అంటుంది.

మధ్యతరగతి జీవితాన్ని గురించి ఆమెకి స్పష్టమైన అవగాహన వుంది. ఉన్నదాంట్లోనే సంతృప్తి పడి, సంతోషాన్ని వెతుక్కునే మనస్తత్వం. తనే అర్థం చేసుకోలేదు. కేంపుల పేరిట, వోటీ పేరిట ఆమెని వంటరితనానికి వదిలేసాడు.

అతనికి తన చిన్నతనం గుర్తొచ్చింది. తల్లి, తాము నలుగురు పిల్లలు. తాత, బామ్మ. తండ్రిది



చిన్న వుద్యోగం. ఇంతమందీ అతనిమీద ఆధారపడి వుండేవారు. అప్పుడప్పుడు వచ్చిపోయే మేనత్తలు. తండ్రి జీతం తిళ్ళకే సరిపోయేది కాదు. తల్లి పక్కవాళ్ళింట్లోంచీ చేబదులు తెచ్చేది. ఆవిడకి వారంలో ఆరురోజులు ఏవో ఒక వుపవాసాలు. ఒక్కోరోజు వంటిపూట తినేది. ఇంకో రోజు పూర్తి వుపవాసం వుండేది. తండ్రి..నీరసంగా, పెరిగిన గెడ్డంతో విసుగ్గా వుండేవాడు. తనకి వుద్యోగం వచ్చేదాకా అదే పరిస్థితి. తర్వాత యిద్దరు తమ్ముళ్ళకీ వుద్యోగాలొచ్చాయి. చెల్లెలి పెళ్ళైంది. తాతా బామ్మా పోయారు. మేనత్తల రాకపోకలు ఆగాయి. కుటుంబం తెరిపిన పడింది.

ఐతే, తనకి కడుపునిండా తిండి కూడా పెట్టలేని భర్తని వదిలేసి పోవాలనిగానీ మరో ప్రత్యామ్నాయం కోసం గానీ తల్లి ఎప్పుడూ అనుకోలేదు. అలాగే సర్దుకుంటూ బ్రతికింది. ఆర్థికంగా బలపడాలనే సౌగంధని వుద్యోగంలో చేరమన్నాడు. ఈరోజున సౌగంధకి ఏ కష్టాలూ లేవు. చేతినిండా డబ్బుంది. ఫ్రిజ్జి నిండా రకరకాల పదార్థాలుంటాయి. బీరువానిండా చీరలు

న్నాయి. అయినా ఆమెకి ఎందుకీ ప్రలోభం? ఏం చూసింది కార్తీక్‌లో? రూమర్లదాకా వచ్చిందంటే వాళ్ళమధ్య ఎంతోకొంత జరిగివుండాలి. ఎందుకిలా జరిగింది? అతని ఆలోచన మళ్ళీ అక్కడికే వచ్చి ఆగింది. కొద్దిసేపటి వెతుకులాట తర్వాత జవాబు దొరికింది.

తన తల్లిదండ్రులు లేమిలో గడిపారు. కష్టాలని పంచుకున్నారు. చాలామంది డబ్బుగలవాళ్ళు వూటీ, కొడైకెనాల్ వెళ్ళి అందమైన అనుభూతుల్ని పంచుకుంటారు. తనకీ సౌగంధకీ అద్భుతమైన అనుభవాలూ లేవూ కష్టాలూ లేవు. పంచుకోవటం అసలే లేదు. ఒక గూటిలో వుంటున్నారు. ఎవరిది వాళ్ళు సంపాదించుకుంటూ ఖర్చుపెట్టుకుంటున్నారు. తామిద్దరి మధ్యా ఏకాంతాలు తరిగిపోయాయి. యింటరాక్షన్స్ తగ్గిపోయాయి. అనుబంధం బలహీనపడింది.

అతను లేచి నిలబడ్డాడు.

★ ★ ★

రోహిత్ యిల్లు చేరేసరికి సౌగంధ పనంతా ముగించుకుని టీవీ చూస్తోంది. పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు. అతను లేటుగా రావటానికీ టూర్ల మీద తిరుగుతూ అసలే యింట్లో వుండకపోవటానికీ అలవాటు పడిపోయింది. కొంత కుతూహలంతో ఆమె ముఖంలోకి చూసాడు. మనసులో ఆమె పడుతున్న సంఘర్షణ ముఖంలో ప్రతిబింబిస్తోంది. ఏం నిర్ణయించుకోబోతోంది సౌగంధ?

''స్నానం చేసిరా రోహిత్! అన్నం పెట్టేస్తాను'' అంది సౌగంధ.

''ఆకలి లేదు'' అన్నాడతను.

ఆమె గ్లాసుతో మజ్జిగ తెచ్చి యిచ్చింది. ఇస్తూ అడిగింది ''ఎందుకు, యీ టూర్లలో తిరిగి అక్కడా యిక్కడా తిని ఆరోగ్యం పాడుచేసుకుంటావు?''

రోహిత్ జవాబివ్వకుండా ఖాళీగ్లాసు సింక్‌లో పడేసి వెళ్ళి పిల్లల మధ్య పడుకున్నాడు. ఎంతో నిశ్చింతగా వుంటున్న తన జీవితం తలక్రిందులైన భావన కలిగింది. కార్తీక్‌తో- ఆమె తనని విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్ళదన్నప్పుడున్న స్థైర్యం- యిప్పుడు లేదు. వెళ్ళిపోతుందా సౌగంధ యింట్లోంచీ, తనని నవ్వించి, సంతోషపెట్టే వ్యక్తి దగ్గరికి? అశాంతిగా దిండులో ముఖం దాచుకున్నాడు.

అందరూ పడుకున్నా సౌగంధకి ఆ రాత్రి నిద్రరాలేదు. టీవీ చూస్తూ కూర్చుని అలాగే సోఫాలో ఎప్పటికో నిద్రలోకి జారుకుంది. ఉదయం చూసేసరికి ఆమె అలా కనిపించడంతో తమ మధ్య దూరం స్పష్టంగా కనిపించింది రోహిత్‌కి. చిన్నగా నిట్టూర్చి వెళ్ళిపోయాడు.

మరికొద్దిసేపటికి లేచిన సౌగంధ అతను యింట్లో లేకపోవటం చూసి తీవ్రంగా గాయపడింది. ఆమె మనసులోని సంఘర్షణ ఓ కొలిక్కి వచ్చింది. వెంటనే కార్తీక్‌కి ఫోన్ చేసింది. వాళ్ళ సంభాషణ ఆమె చెప్పిన సారీతో మొదలైంది.

కార్తీక్ చిన్నగా నవ్వాడు, ''నువ్వింత టైమ్ తీసుకుంటేనే నాకర్థమైంది నీ జవాబు అదే వుంటుందని'' అతని గొంతులో నిరాశ.

''నాకిప్పుడు తెలుస్తోంది కార్తీక్, రోహిత్‌తో నాకొక బలమైన అనుబంధం ఏర్పడింది. అతను ఎదురుగా వున్నప్పుడు అతన్తో దెబ్బలాడుతుంటాను. టూర్లలోనూ, బయట యింకెక్కడోనూ వున్నప్పుడు అతను క్షేమంగా వున్నాడో లేదోనని ఆందోళన పడతాను. అతన్లో మార్పు కావాలని కోరుకున్నానుగానీ, అతను లేని జీవితాన్ని ఎప్పుడూ వూహించుకోలేదు. ఈరోజు మొదటిసారి అతనెందుకో నా పట్ల వుదాశీనత చూపించాడు. నాకది చాలా బాధనిపిస్తోంది''

''ఇంకా?''

''ఇద్దరు వ్యక్తులు కలిసి వుండటానికి స్నేహం ఒక్కటీ చాలదు. ప్రేమ వుండాలి. ఏదేదో కావాలనే ఆకాంక్ష వుండాలి. అలాంటివేవీ నాలో లేవు. మొన్న నీతో మాట్లాడి వచ్చాక, నేను అదే విషయాన్ని గురించి చాలా ఆలోచించాను. దానిలోని సాధ్యాసాధ్యాలు, పర్యవసానాల గురించి ఆలోచించాను. ఆ ఆలోచనల్లో గుండె తరుక్కుపోయే బాధేగానీ రవ్వంత కూడా సంతోషం కలగలేదు. కార్తీక్..నేను నీతో వచ్చెయ్యడాన్ని గురించి ఆలోచించే సమయంలో నా ఆలోచనల్లో కదిలినది రోహిత్‌గానీ నువ్వు కాదు. మనం విడివిడిగా కూడా స్నేహితుల్లా బ్రతకచ్చు. కానీ మేం విడిపోవడం ఎలా సాధ్యం?''

''...''

''అతన్నుంచీ ఎక్కువగా ఆశించాను. అతని స్వభావానికి విరుద్ధమైనవి అతనివ్వాలని కోరుకున్నాను. అది నా తప్పే. నా సరదాలకి అతనెప్పుడూ అడ్డు చెప్పలేదు. నేను పిల్లల్ని తీసుకుని ఎక్కడికేనా వెళ్తానంటే తను వద్దనడు. అనవసరం ఖర్చుని మాత్రం గుర్తుచేస్తాడు. నా పాకెట్‌మనీలోంచీ మీటౌతానంటే యింకే ఆక్షేపణా వుండదు''

కార్తీక్ నవ్వేసాడు. ఓటమిని వప్పుకుంటున్న నవ్వది. ముందురోజు రోహిత్ వచ్చి ఏం చెప్పాడో సరిగ్గా అదే జరగటం అతనికి ఆశ్చర్యం వేసింది. అతనే ఆమెచేత అలా చెప్పిస్తున్నాడా అన్న అనుమానం కూడా కలిగింది. ''నిన్న రోహిత్ నా దగ్గర కొచ్చాడు'' అన్నాడు నెమ్మదిగా.


సౌగంధ చకితురాలైంది. హఠాత్తుగా భర్త ప్రవర్తనలో వచ్చిన మార్పుకి కారణం అర్థమైంది. ''కానీ నాతో యిప్పటిదాకా చెప్పలేదు'' అంది. ఈసారి ఆశ్చర్యం కార్తీక్ వంతైంది. అంత అవగాహనగల భార్యాభర్తలైతే సౌగంధలో ఆ నిరాసక్తత, వెతుకులాట ఎందుకు?

తిండికీ బట్టకీ లోటులేకపోతే చాలనుకునే మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది తను. తండ్రికి వుద్యోగం, బైటి వ్యవహారాలు. తల్లికి యిల్లు, పని, యిరుగుపొరుగులు. అన్యోన్యమైన దాంపత్యమే. కానీ పైకి కనిపించని యింకేదో దూరం వుండేది వాళ్ళ మధ్య. రోహిత్ కూడా అలాంటి కుటుంబం లోంచే వచ్చాడు. అతని తండ్రి దగ్గర్నుంచీ ఏం నేర్చుకున్నాడో అవే తనకిస్తున్నాడు. అవి తన ఆకాంక్షల అంచుని కూడా తాకనంత దూరం అందర్లాగే తామిద్దరి మధ్యనీ గేప్. తమకే ప్రత్యేకమైనది కాదు.

రోహిత్‌ని పెళ్ళి చేసుకున్నప్పుడు ఒకసారి తను పెంచుకున్న అనుబంధాలన్నీ తెంచుకుంది. పంథొమ్మిదేళ్ళపాటు పుట్టిపెరిగిన పరిసరాలకి అతిథిగా మారిపోయింది. ఇప్పటికీ తన ప్రాణం అక్కడికి వెళ్ళాలని తపించిపోతుంది. రోహిత్‌ని వదిలేసి కార్తీక్‌తో వెళ్ళిపోవటమంటే మరోసారి అన్ని అనుబంధాలనీ తెంచుకోవడం. అది తను తట్టుకోగలదా? ప్రేమలో ముంచి తేల్చి అన్నిటినీ మరిపిస్తానని అతను అనవచ్చు.

ఇంకా ముఖ్యమైనది యింకొకటి వుంది సౌగంధ మనసులో...కార్తీక్‌తో చర్చించిన వాటికంటే ఎక్కువ విషయాలే సౌగంధ స్వరూపతో చర్చించింది. వ్యక్తిగత అనుభవాలు, కుటుంబాలలోని లోతులూ అన్నీ మాట్లాడుకున్నారు. ఐనా భర్తల్ని వదిలేసి ఒక దగ్గర వుండాలని ఎప్పుడూ అనుకోలేదు. కార్తీక్‌పట్ల ఎలాంటి కాంక్షా, ప్రేమా లేకుండానే అతన్తో వెళ్ళాలనే ప్రతిపాదన వచ్చిందంటే తమ స్నేహం ఎక్కడో తప్పుగా నిర్వచించబడిందని అనిపిస్తోందామెకి.

కార్తీక్ ఆమె మౌనాన్ని అర్థం చేసుకున్నాడు. ''నాతో రావడానికి గల అవకాశాలకంటే రాకుండా వుండటానికి సపోర్ట్



చేసే కారణాలనే ఎక్కువగా వెతుక్కుంటున్నట్టున్నావు'' వ్యంగ్యంగా అని పెట్టేసి వెంటనే రోహిత్ సెల్‌కి చేసాడు.

''కంగ్రాట్స్. నువ్వే గెలిచావు'' అన్నాడు. అతని గొంతు వినడానికి ప్రశాంతంగానే ధ్వనించినా లోలోపల్నుంచీ ఈర్ష్య సెగలు చిమ్ముతోంది.

రోహిత్‌కి సౌగంధ తను ఆశించినట్టే ప్రవర్తించినందుకు చాలా సంతోషం కలిగింది. ప్రసన్నంగా నవ్వాడు. ''ఇందులో గెలుపోటముల ప్రసక్తిలేదు. వివాహ వ్యవస్థమీద మాకిద్దరికీ గల నమ్మకం. ఎన్ని కష్టనిష్ఠూరాలు ఎదురైనా జీవితాంతం దాకా కలిసే వుండాలనే మోటివేషన్‌తో మా సహచర్యం మొదలైంది. అంతేగానీ ఏవో భావాలని నిలబెట్టుకోవడానికో, ఏ ఆకర్షణలకోసమో మొదలైనది కాదు.''

కార్తీక్ టప్‌మని ఫోన్ పెట్టేసాడు.

★ ★ ★

కార్తీక్‌తో మాట్లాడాక సౌగంధకి కాలం ఆగిపోలేదు.

పనిమనిషి వచ్చి వెళ్ళింది. పిల్లలకి టైమౌతుంటే తయారుచేసి స్కూలుకి పంపింది.

రోహిత్ ఎక్కడికెళ్ళాడో ఎప్పుడొస్తాడో తెలీదు. వూళ్ళోనే వున్నాడో టూర్లో వెళ్ళాడో కూడా తెలీదు. అతనెప్పుడూ యిలా చెయ్యలేదు. తను పొరపాటు దిద్దుకోవాలనుకున్నా, అతను ఒప్పుకోడా? ఆమెకి ఒక్కసారిగా ఎక్కడలేని నిస్పృహ ఆవరించింది. అన్నీ అమరివున్న జీవితాన్ని ఎందుకింత క్లిష్టంగా చేసుకుంది? దుఃఖం వెల్లువలా పొంగింది. చాలాసేపు ఏడుస్తూ వుండిపోయింది.

కార్తీక్ మాట్లాడాక రోహిత్ బైటే తిని ఆఫీసుకి వెళ్ళిపోయాడు. సౌగంధ మీద స్వల్పంగా యింకా కోపం మిగిలి వుందతనికి. దాన్ని చల్లార్చుకునే ప్రయత్నంలోనే ఆమెని తప్పించుకుని తిరుగుతున్నాడు. సాయంత్రానికి యిల్లు చేరాడు.

''ఎక్కడికెళ్ళావో చెప్పలేదు. ఎప్పుడొస్తావో తెలీదు. నీకోసం ఎదురుచూడటంలోనే ఎప్పుడో నేను చచ్చిపోతాను'' అంది సౌగంధ గట్టిగా. ఏడ్చి ఏడ్చి ఆమె ముఖం ఎర్రగా వుబ్బి వుంది. ఆమెనలా చూసేసరికి రోహిత్ మంచులా కరిగిపోయాడు. రెండు చేతులూ చాపి దగ్గరకి తీసుకున్నాడు. మనిషి వెతుక్కునేది ఈ పిసరంత కన్సర్న్ కోసమే అనే విషయం యిద్దరికీ ఏకకాలంలో అర్థమైంది.

కార్తీక్ వుద్యోగం వదిలేసి వెళ్ళిపోయాడు. పెళ్ళి ముందు కూడా సౌగంధకి చెప్పలేదు. మళ్ళీ ఆమెని కలవలేదు. అతనెక్కడున్నా సుఖంగా వుంటే చాలనుకుంది ఆమె.

★ ★ ★

చాలా సంవత్సరాల తర్వాత సౌగంధ పెళ్ళి గురించి తన కూతురి అభిప్రాయం అడిగింది. అప్పటికి ఆ అమ్మాయి చదువు పూర్తి చేసి వుద్యోగంలో చేరింది. రోహిత్ పెళ్ళి చేద్దామన్నాడు. సౌగంధ అందుకే అడిగింది.

''అమ్మా! అవసరం అనుకుంటే పెళ్ళి యిద్దరికీ అవసరమే. లేదనుకుంటే లేదు. వెనకటి రోజుల్లోలా ఏదో పర్పస్ కోసం పెళ్ళి చేసుకునే రోజులు కావివి.

పిల్లలకోసం మగవాళ్ళూ, వండి యిల్లు చూసుకోవడం కోసం లేక సోషల్ సెక్యూరిటీ కోసం ఆడవాళ్ళూ అనే రోజులు పోయాయి. పిల్లలు టెస్ట్ ట్యూబుల్లోనూ తయారౌతున్నారు. క్లోనింగ్ ద్వారా కూడా పుడుతున్నారు. వంటా తిండీ అనేవి పెద్ద సమస్యలు కావు. మైక్రోవేవ్ సెట్ చేసుకుంటే ఎవరేనా వేడివేడిగా తయారుచేసుకోవచ్చు. ఇంక వుండాల్సింది ఒక్కటే.

కమిట్‌మెంట్ ఒకరికోసం ఒకరం చివరిదాకా కలిసివుండటం అనే కమిట్‌మెంట్. భర్త అనేవాడు మంచి ఫ్రెండ్ కాలేకపోవచ్చు. మంచి ఫ్రెండ్ రెస్పాన్సిబుల్ హజ్బెండ్ కాకపోవచ్చు. కాబట్టి పెళ్ళి వేరు, ఫ్రెండ్‌షిప్ వేరు.

ఒక తల్లి పిల్లలు కూడా ఏ యిద్దరూ ఒకలా ఆలోచించరు. ఇద్దరు ఫ్రెండ్స్ కూడా తమకి యింట్రెస్ట్ కలిసే విషయాలనే మాట్లాడుకుంటూ, వాటినే ప్రమోట్ చేసుకుంటూ ఫ్రెండ్‌షిప్‌ని పెంచుకుంటారు.

చిన్న అభిప్రాయ భేదం వస్తే జన్మలో మళ్ళీ ముఖం కూడా చూసుకోనివాళ్ళున్నారు. పెళ్ళంటే అలా విడిపోవాలనిపించకూడని ఎడ్జస్ట్‌మెంట్. ఈ విషయాలు అర్థం చేసుకోగలిగే వ్యక్తిని చేసుకుంటాను'' అందా అమ్మాయి తన అభిప్రాయాలని స్పష్టంగా చెప్తూ.

రోహిత్, సౌగంధ ఒకరినొకరు చూసుకున్నారు. భావాలు వేరవచ్చు, పదాలు మారవచ్చు. కానీ మనిషి కోరిక మాత్రం అప్పటికీ యిప్పటికీ ఒకటే...శాశ్వతమైన అనుబంధం ఒక్కటేనా వుండాలి..జీవితాన్ని నిలబెట్టడానికి ఆ ఒక్కటీ చాలని.

☆

## బంధం

**ఇప్పుడు కరీనా కపూర్, కరణ్‌జోహార్‌ల గురించి జనం అంతా ఏదేదో అనుకుంటున్నారు. అసలే సినిమా రంగం అందునా గాసిపులు రాజ్యం ఏలే ఈ ప్రపంచంలో వీరిద్దరి బంధం గురించి సినీజనం చెవులు కొరుక్కుంటున్నారు. వీరిద్దరూ బాంద్రాలోని రెస్టారెంట్‌లో కన్పించారని చాలామంది అంటున్నారు. కరీనా ఇప్పుడు తన ఖాళీటైంని తన అందానికి మెరుగులు దిద్దుకోవడానికి, వెరైటీ ఫుడ్స్ కోసం కేటాయిస్తున్నట్టుంది.**

